

నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
3 | నిజామాబాద్, ఆదివారం 2 జూన్ 2024 | NIZAMABAD



కామారెడ్డిలో మూటలు మోస్తున్న కేసీఆర్(ఫైల్)



## ధూంధాం.. దుమ్మురేపిన కామారెడ్డి

కామారెడ్డి, జూన్ 1: రాష్ట్ర సాధన కోసం ప్రారంభమైన పోరులో కామారెడ్డి ప్రాంతం మొదటి నుంచి అండగా నిలిచింది. పిడికెడు మందితో మొదలైన తెలంగాణ రాష్ట్రసమితికి తొలినాళ్లలో కామారెడ్డి ప్రాంతానికి చెందినవారు మద్దతుగా నిలిచారు. 2001 ఏప్రిల్ 27న టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన తర్వాత కరీంనగర్ బహిరంగ సభకు కామారెడ్డి బార్ అసోసియేషన్‌లో మొదట తీర్మానం చేసి కేసీఆర్‌కు కొండంత ధైర్యాన్నిచ్చారు. బార్ అధ్యక్షుడిగా ఉన్న తెలంగాణ ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ సభకు తరలివెళ్లి కేసీఆర్ పోరాటానికి మద్దతు తెలిపారు.

**కామారెడ్డి కేంద్రంగా కేసీఆర్ ఉద్యమ కార్యాచరణ**

స్వరాష్ట్రకాంక్ష బలంగా వినిపించిన ప్రాంతాల్లో కామారెడ్డి ప్రాంతం ముఖ్యమైంది. ఉద్యమంలో భాగంగా తెలంగాణ కూలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రిగేడియర్‌గా కామారెడ్డి ఇన్‌చార్జిగా కేసీఆర్ పాల్గొన్నారు. పార్టీ నడిపేందుకు అయ్యే ఖర్చులు, బహిరంగ సభల కోసం పార్టీ శ్రేణులు కూలి పని చేయాలని నిర్ణయించి కూలి ద్వారా నిధి సేకరణ చేపట్టారు. కామారెడ్డి పట్టణంలో దేశాయి బీడీ ఫ్యాక్టరీ గోడాన్‌లో తెలంగాణ కూలికి కేసీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీడీ బెండళ్లను స్వయంగా మోశారు. అనంతరం కామారెడ్డి గాంధీ గంజ్‌లో బెల్లం ముద్దలను మోశారు. టీఆర్ఎస్ పురుడు పోసుకున్న సమయంలో కామారెడ్డి నియోజకవర్గంలోని మాచారెడ్డి మండలంలో అన్ని గ్రామాల్లో మెజార్టీ ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం కావడం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే సంచలనం సృష్టించింది.

**తొలి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య..**



తెలంగాణ కోసం తొలి ఆత్మార్పణ కానిస్టేబుల్ కిష్టయ్యదే. 2009 నవంబర్ 30న కేసీఆర్ ఆమరణ నిరహార దీక్షకు దిగారు. అదే సమయంలో ప్రత్యేకరాష్ట్రం కోసం కామారెడ్డి పట్టణంలో సెల్ టవరెక్కిన పోలీస్ కానిస్టేబుల్ కిష్టయ్య ఆత్మబలిదానం చేసుకున్నాడు. విధుల్లో ఉన్న కిష్టయ్య తుపాకీతో కాల్చుకొని అమరుడయ్యాడు. అనంతరం ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం కానిస్టేబుల్ కూతురును డాక్టర్ చదివించాడు.భార్యకు ఉద్యోగం కల్పించాడు.





మోతె గ్రామస్తులతో ఉద్యమనేత కేసీఆర్(ఫైల్)

## ఆ గ్రామం నుంచే మోతెమోగింది

వేల్పూర్ ,జూన్ 1: మలిదశ ఉద్యమానికి వేల్పూర్ మండలం మోతె గ్రామం దిక్సూచిగా నిలిచింది. ప్రత్యేక రాష్ట్ర సాధనే ఏకైక ఎజెండాగా వచ్చిన టీఆర్ఎస్ పార్టీకి మాత్రమే మద్దతుని స్తామని 2001 మే 5వ తేదీన మోతె గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇది అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఉద్యమ బాటలో మరెన్నో గ్రామాలు కదిలేలా స్ఫూర్తిని నింపింది. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ మోతె స్ఫూర్తిని విశ్వ వ్యాప్తం చేశారు. దివంగత ఉద్యమ నేత వేముల సురేందర్ రెడ్డితో కలిసి మోతెకు వచ్చారు. మోతె గడ్డ మీది మట్టిని ముడుపు కట్టారు. తెలంగాణ రాష్ట్రం సాకారమయ్యాక తిరిగి ఆ మట్టి ముడుపును మోతె గడ్డపైనే విప్పుతానని ప్రకటించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 మార్చి 28న వేముల సురేందర్ రెడ్డి, ఆయన తనయుడు అప్పటి రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, తదితర నాయకులతో కలిసి మోతెకు వచ్చి ముడుపు విప్పారు. అనంతరం 2014, 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మోతె టీఆర్ఎస్ పార్టీకి ఏకగ్రీవ తీర్మానాలతో అండగా నిలిచింది. అదే తరహాలో మోతెను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అభిమానిస్తారు.

## వేడుకలకు సిద్ధం



తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని అమరువీరుల స్తూపం తోపాటు కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు విద్యుద్దీపాల వెలుగులతో కళ కళ లాడుతున్నాయి. ఆదివారం ఉదయం అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం జాతీయ జెండాను ఎగురవేయనున్నారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





విద్యుత్ వెలుగుల్లో కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయాలు

# ఉద్యమ నేల ఇందూరు

## కేసీఆర్ నేతృత్వంలో పోరుబాట

- మలిదశ పోరాటంలో ప్రత్యేక స్థానం
- స్వరాష్ట్ర సాధనలో ఉమ్మడి జిల్లా ఆదర్శం
- ఉద్యమం నుంచి విజయతీరాలకు తెలంగాణ
- బీఆర్ఎస్ పదేండ్ల పరిపాలనలో రాష్ట్రానికి గుర్తింపు
- నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది దినోత్సవం




నిజామాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): స్వరాష్ట్ర సాధనలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉన్నది. మలిదశ పోరాటంలో కేసీఆర్ వెన్నంటే నిలిచి విజయతీరాలకు చేర్చిన ఘనతలో ఈ ప్రాంతం చూపిన స్ఫూర్తిదాయకమైన ప్రస్థానం చరిత్రలో నిలిచింది. తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా టీఆర్ఎస్ పార్టీ పురుడు పోసుకున్న స్వల్ప కాలంలోనే ఎదురైన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుబి మోగించి నిజామాబాద్ చరిత్ర సృష్టించింది. సమైక్యవాద పార్టీలకు ముచ్చెమటలు పట్టించడంలో, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను చాటిచెప్పడంలో, రాజకీయ రణక్షేత్రంలో ప్రజలు పెద్ద ఎత్తున చైతన్యాన్ని చూపారు. ఇందూరు జడ్పీ పీఠంపై గులాబీ జెండాను ఎగురవేసి నాటి కాంగ్రెస్, టీడీపీ పార్టీలకు గట్టి షాక్‌ను ఇచ్చారు. తదనంతరం ఎదురైన ఉప ఎన్నికల్లో విజయాలు, లోకల్ బాడీ పోరులో భారీ గెలుపుతో టీఆర్ఎస్ ప్రస్థానం అంచెలంచెలుగా ఎదిగి కంచుకోటగా నిలిచింది. కేసీఆర్ ఇచ్చిన పిలుపును అందుకుని ప్రతి ఉద్యమ సందర్భంలోనూ ఈ ప్రాంత బిడ్డలు ప్రాణాలు తెగించి కొట్లాడారు.

**చెరిగిపోని సంతకం..**

ఉమ్మడి రాష్ట్రంలో తీవ్రమైన నిర్లక్ష్యానికి, వివక్షకు గురైన నిజామాబాద్ జిల్లా నేడు తాగు, సాగునీటితో పాటుగా అన్ని రంగాల్లోనూ ముందు భాగంలో నిలిచింది. రాష్ట్ర ఏర్పాటు అనంతరం కొలువుదీరిన కేసీఆర్ ప్రభుత్వంలో పదేండ్లలో ఈ ప్రాంతం మరుపురాని అభివృద్ధిని నమోదు చేసింది. ఒకప్పుడు ధాన్యం ఉత్పత్తిలో అంతంత మాత్రంగానే ఉన్న ఈ ప్రాంతం కేసీఆర్ హయాంలో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. దాదాపుగా 10లక్షల ఎకరాల్లో పంటలు సాగుకు నోచుకున్నాయి. నీటి పారుదల రంగంలో మిషన్ కాకతీయ, ఎస్సారెస్పీ పునరుజ్జీవంతో బీడు భూములకు నీళ్లు మళ్లించారు. కొత్త గ్రామ పంచాయతీలు, కొత్తగా మండలాల కూర్పు, జిల్లా ఏర్పాటుతో పరిపాలన వికేంద్రీకరణ జరిగింది. కామారెడ్డి జిల్లా ఏర్పాటుతో మెరుపు వేగంతో అభివృద్ధి సాధించింది. మౌలిక సదుపాయాల కల్పన, పల్లెల్లో విప్లవాత్మకమైన మార్పు, ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు, వ్యవసాయ రంగంలో రైతులకు అనుకూలమైన వాతావరణం, సాగుకు ఢోకా లేకుండా ఉచితంగా నిరంతర కరెంట్‌తో అనతి కాలంలోనే తెలంగాణ ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది.

## బోధన్‌లో చారిత్రాత్మక దీక్షలు



బోధన్‌లో తెలంగాణ నిరాహారదీక్షలకు ఏడాది పూర్తయిన సందర్భంగా (2010 డిసెంబర్ 27న) జరిగిన బహిరంగసభలో మాట్లాడుతున్న కేసీఆర్

బోధన్, జూన్ 1: మలిదశ ఉద్యమంలో తెలంగాణ సాధనే ధ్యేయంగా బోధన్ పట్టణంలో సుదీర్ఘకాలంపాటు కొనసాగిన నిరాహారదీక్షలకు నాటి ఉద్యమనేత, తెలంగాణ రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్ఫూర్తిప్రదాతగా నిలిచారు. కేసీఆర్ అందించిన స్ఫూర్తితో నిరాహారదీక్షలతో పాటు వివిధ రూపాల్లో తెలంగాణ పోరు బోధన్‌లో ఉవ్వెత్తున లేచింది. తెలంగాణ ఉద్యమ చరిత్రలో బోధన్ ఓ పోరుగడ్డగా నిలిచింది. బోధన్‌లో తెలంగాణవాదులు జేఏసీగా ఏర్పడి ప్రారంభించిన నిరాహారదీక్షలకు చారిత్రాత్మక ప్రాధాన్యత ఉన్నది. ఒక పక్క రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ పర్యటిస్తూ సాగిస్తున్న పోరాటం.. స్థానికంగా బోధన్ ప్రాంతంలోని తెలంగాణవాదులకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చింది. బోధన్‌లో ఏదో ఆరు నెలలో.. ఏడాదో కాదు.. ఏకంగా 1519 రోజులపాటు తెలంగాణవాదులు నిరాహారదీక్షలు చేశారు. తెలంగాణ ఉద్యమకాలంలోనూ, తెలంగాణ ఆవిర్భావం అనంతరం కూడా హైదరాబాద్‌తో సహా పలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో కేసీఆర్ బోధన్ నిరాహారదీక్షల విషయాన్ని తరచుగా ప్రస్తావించేవారు. బోధన్‌లో 2009 డిసెంబర్ 28న ప్రారంభమైన నిరాహారదీక్షలు 1519 రోజులపాటు.. అనగా 4 సంవత్సరాల 17 రోజులపాటు కొనసాగి 2014 ఫిబ్రవరి 23న ముగిశాయి.



కేసీఆర్ రెండవసారి బోధన్ నిరాహార దీక్షల శిబిరాన్ని సందర్శించినప్పుడు దీక్షలో ఉన్న 731మంది మహిళలు (ఫైల్)







తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ అమరజ్యోతి వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్‌షిండే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 'ఫుల్లు'గా తాగేశారు..

- సమ్మర్‌లో భారీగా బీర్ల అమ్మకాలు
- మూడు నెలల్లో రూ.440.18కోట్ల ఆదాయం

మాక్లూర్, మే 1: ఎండ తీవ్రత ఓ వైపు ..మరోవైపు పెండ్లిళ్ల సీజన్ కావడవంతో ఉమ్మడి జిల్లాలో బీర్ల విక్రయాలు జోరుగా కొనసాగాయి. మార్చి నుంచి మే31 వరకు మూడు నెలల్లో సర్కారుకు దండిగా ఆదాయం సమకూరింది. ఉమ్మడి జిల్లాలో 29 బార్లు, 151 వైన్స్ షాపులు ఉన్నాయి. మాక్లూర్ మండలం మాదాపూర్‌లోని ఇండియన్ మేడ్ లిక్కర్ కార్యాలయం నుంచి ఉమ్మడి జిల్లాకు మద్యం సరఫరా అవుతుంది. వేసవి తాపం పేరిట యువత బీర్లను ఫుల్లుగా లాంగించేశారు. ఓ వైపు యువత మత్తులో జోగితే, మరో వైపు సర్కారుకు దండిగా ఆదాయం సమకూరింది. మార్చిలో లక్షా 16వేల బీర్ కేసులు, 2.66లక్షల లిక్కర్ కేసులు విక్రయించగా రూ.139కోట్ల ఆదాయం వచ్చింది. ఏప్రిల్‌లో 2లక్షల 66వేల బీరు కేసులు, లక్షా35వేల లిక్కర్ కేసులు విక్రయించగా రూ.143కోట్ల ఆదాయం వచ్చింది. మే నెలలో 2లక్షల 64వేల బీరు కేసులు, లక్షా50వేల లిక్కర్ కేసులు విక్రయించగా రూ.158.18కోట్ల ఆదాయం సమకూరింది . ఒక్క 'మే'లోనే దంచి కొట్టినా ఎండలకు రూ.158.18కోట్లు వచ్చాయి. వేసవి తాపానికి తట్టుకోలేకపోవడంతో బీర్లకు మంచి గిరాకీ ఏర్పడింది. ఎక్సైజ్ అధికారులు రేషన్ పద్ధతిలో వైన్స్‌లు, బార్లకు పంపిణీ చేశారు. లిక్కర్ కన్నా బీర్లకు దండిగా ఆదాయం లభించగా సర్కారు ఖజానాకు మూడు నెలల్లో ముచ్చటగా రూ.440.18కోట్ల మద్యాన్ని ఉమ్మడి జిల్లా వాసులు తాగేశారు. ఎన్నికల సమయంలో మూడు రోజులు వైన్సులు బందు లేకుంటే మరింత ఆదాయం వచ్చేదని అన్నారు.





